క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దౌల్తాబాద్: మండల పరిధి చంద్రకల్, కుప్పగిరి గ్రామాల్లో శనివారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రావల్‌పల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

యాలాలలో..

యాలాల: మండల పరిధి బాగాయిపల్లి, రాఘవపూర్, ధారూరు మండలం నాగారం సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో తాండూరు డివిజన్ అధికారి భానుప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



సమాఖ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహించేలా అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మహిళా సమాఖ్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమైయ్యే నాటికి మౌలిక సదుపాయాల కల్పన పూర్తి కావాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, ఎంఈఓ హబీబ్ అహ్మద్, మహిళా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొర్విచెడ్‌గనిలో పోలేరమ్మ జాతర

ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



భక్తులతో రోహిత్‌రెడ్డి

తాండూరు: బషీరాబాద్ మండలం కొర్విచెడ్‌గని గ్రామంలో పోలేరమ్మ జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామస్తులు నెత్తిన బోనంతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జాతరలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

కొనుగోలు కేంద్రాలను నిరంతరం కొనసాగించండి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ

కుల్కచర్ల: రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం కొనసాగించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం కుల్కచర్ల, తిర్మలాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని, వారు నష్టపోకుండా ధాన్యం త్వరగా సేకరించాలని నిర్వాహకులకు సూచించారు. అదే సమయంలో దుమ్ముధూళి, తాలు లేకుండా ధాన్యం తీసుకురావాలని రైతులకు సూచిస్తూ.. కొనుగోలు చేయాలని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, సీఈఓ బక్కారెడ్డి, డైరెక్టర్ కొండయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం స్టిచ్చింగ్‌కు క్లాత్ అందజేత

బంట్వారం: రానున్న విద్యా సంవత్సరం నాటికి విద్యార్థుల యూనిఫాంలు సిద్ధం కావాలని ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ చేతుల మీదుగా ఏకరూప దుస్తుల తయారీకి కోట్‌పల్లి మండలం మానవ వనరుల కేంద్రంలో ఐకేపీ సిబ్బందికి క్లాత్ అందజేశారు. అనంతరం మాట్లాడారు. పాఠశాలల ప్రారంభం నాటికి మండల పరిధి 1,575 మంది విద్యార్థులకు స్టిచ్చింగ్ చేసి, రెండు జతల చొప్పున యూనిఫాంలు అందజేయాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. విద్యార్థుల దుస్తులు కుట్టే బాధ్యతను డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు తీసుకున్నారని పేర్కొన్నారు. ఒక్కో జతకు కుట్టు కూలి రూ.50 ప్రభుత్వం వీరికి చెల్లిస్తుందని వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభం నాటికి ముందుగా ఒక జత విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్, ఎంఈఓ చంద్రప్ప, ఐకేపీ ఏపీఎం శివయ్య, సీఆర్‌పీ నర్సింలు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యల తిష్ట



చిత్తడిలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్

చిరుజల్లులతో చిత్తడి

- నిర్వహణ లోపంతో అపరిశుభ్రత
- బురదలోనే క్రయవిక్రయాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- సమస్యల పరిష్కారం కోసం విజ్ఞప్తి

పరిగి: మార్కెట్ యార్డు పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నపాటి వర్షానికే అస్తవ్యస్తంగా తయారయింది. వర్షపు నీరు నిలబడి, మురికి కూపంగా దర్శనమిస్తోంది. దీంతో మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పరిగిలో వారానికి రెండు రోజులు శుక్రవారం, శనివారం సంత జరుగుతుంది. ఇక్కడికి పరిసర ప్రాంత గ్రామాల నుంచి ధాన్యం, కూరగాయలు విక్రయించేందుకు రైతులు, వ్యాపా రులు వస్తుంటారు. అలా వారంలో రెండుసార్లు మార్కెట్‌కు వచ్చిన వారికి నిర్వాహకులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. కనీసం మార్కెట్ యార్డు, పరిసరాలను శుభ్రంగా ఉంచడంలోనూ నిర్లక్ష్యం వహించారు. దీంతో వర్షపు నీటితో ఆ ప్రాంగణమంతా చిత్తడిగా మారి, ధాన్యం లోడుతో వస్తున్న వాహనాలు ముందుకు సాగని దుస్థితి నెలకొనగా.. అదే బురదలో కూరగాయలు, తదితర నిత్యావసరాల క్రయవిక్రయాలు జరగడం గమనార్హం.

దోమల బెడదతో బెంబేలు

సీసీరోడ్డు వేసే సమయంలో వర్షం నీరు వెళ్లేందుకు ఎలాంటి మార్గం ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడికక్కడే నీరు నిలిచి, మడుగులా తయారయింది. తద్వారా దోమలు వృద్ధి చెంది, విష జ్వరాలు ముసిరే ప్రమాదం ఉందని సంతకు వచ్చే వారితో పాటు, కాలనీ వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నా రు. మార్కెట్ సమస్యల గురించి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి పేరుకుపోతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ సూర్యనారాయణ, సిబ్బంది

అవగాహన లేమితోనే రోడ్డు ప్రమాదాలు

- సురక్షిత డ్రైవింగ్‌తో గమ్యం చేరుకోండి: ఏఎస్‌ఐ

దోమ: అవగాహన లేమితోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నిబంధనలు పాటిస్తూ.. వాహనదారులు క్షేమంగా గమ్యం చేరుకోవాలని ఏఎస్‌ఐ సూర్యనారాయణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించారు. వాహనం నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహన ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని చెప్పారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని, వేగ నియంత్రణ తప్పని సరిగా పాటించాలని హెచ్చరించారు. మీ కోసం కుటుంబ సభ్యులు ఇంటివద్ద ఎదురు చూస్తారని, అనుకోని సంఘటనలు జరిగితే, వారు అనాథలవుతారని వెల్లడించారు. వారిని దృష్టిలో పెట్టుకుని, తోటి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా వాహనాలను నడిపాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేందర్, హీరాలాల్, మాధవి పాల్గొన్నారు.

సమన్వయంతోనే పల్లెల ప్రగతి

- వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి
- రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలి
- ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బంట్వారం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే పల్లెల ప్రగతి సాధ్యమని కోటపల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. పైప్‌లైన్‌ల లీకేజీలు సత్వరమే అరికట్టాలని చెప్పారు. ఉపాధిహామీ పనుల ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేయాలని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించి, విధులు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియెల్, ఎంఈఓ చెంద్రప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వేణుమాధవ్ పాల్గొన్నారు.

చైతన్యమేదీ?



పొలంలో దుక్కిదున్నుతున్న రైతు

- అటకెక్కిన మన తెలంగాణ–మన వ్యవసాయం
- నాలుగేళ్లుగా రైతు చైతన్య యాత్రలు నిల్
- వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు

దౌల్తాబాద్: పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహించే రైతు చైతన్య యాత్రలు నాలుగేళ్లుగా నిర్వహించడంలేదు. దీంతో పంటలపై రైతులకు అవగాహన కొరవడింది. నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, ఏ పంటలు వేయాలి తదితర వాటిపై అవగాహన కల్పించకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరో పది రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుండగా.. ప్రభుత్వం చైతన్య యాత్రల గురించి చర్యలు తీసుకోవటం లేదు.

మూస పద్ధతిలో..

వ్యవసాయంలో అధిక దిగుబడి పొందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సలహాలు, సూచనలు రైతులకు వ్యవసాయశాఖ ఇవ్వాల్సి ఉంటుంది. ఏటా వానాకాలం సీజన్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు చైతన్య యాత్ర పేరిట గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. సంబంధిత అధికారులు కొన్నేళ్లుగా వీటిపై దృష్టి సారించడంలేదు. ఫలితంగా ఏ పంట వేసుకోవాలనే విషయాలు తెలియక, మూస పద్ధతిలో వరి, పత్తి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ సాగు విధానం వలన ఇటీవల కాలంలో తెగుళ్ల బెడదతో పత్తి, మిరప పంటలతో అన్నదాతలు ఆర్థికంగా దెబ్బతిన్న పరిస్థితులు లేకపోలేదు. రైతు చైతన్య యాత్రల్లో భాగంగా భూసార పరీక్షల ఆవశ్యకత, పంటల మార్పిడి, చీడపీడల నివారణ, సాగులో నష్టం వచ్చినప్పుడు, పాడిపశువుల ద్వారా అభివృద్ధి, పశుసంవర్ధకశాఖ అందిస్తున్న రాయితీలు, విత్తనోత్పత్తికి సంబంధించిన తదితర విషయాలపై రైతులను చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సూచనలు పాటించాలి



మన తెలంగాణ–మన వ్యవసాయం పేరిట రైతు చైతన్య యాత్రలు గతంలో ఉండేవి. ఇప్పుడు ఏఈఓలు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటున్నారు. రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

తడిసిన ధాన్యం కొనాలి

- తేమశాతం ఎక్కువైనా సరే..
- పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



నాగారం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

ధారూరు: తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కురిసిన అకాల వర్షానికి నాగారం కొనుగోలు కేంద్రంలో తడిసి ముద్దయిన వరి కుప్పలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. కల్లాల్లో ఆరబెట్టిన, విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కుప్పలుగా పోసిన వరి ధాన్యం.. వర్షానికి తడిసి పోయిందని, ఎలాంటి తరుగు తీయకుండా వాటిని కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలన్నారు. ఈ మేరకు కేంద్రాల నిర్వాహకులకు సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ఇదిలా ఉండగా.. రైతులు తమ ధాన్యం ఆర బెట్టుకోవటానికి 35 టాడిపత్రిలు నాగారం పంపించామని చైర్మన్ తెలిపారు. తరుగు, తడిసిన ధాన్యం విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తగిన చొరవ తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. చైర్మన్ వెంట సీఈఓ కె.నర్సింహులు, సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందించాలని తెలంగాణ సోషలిస్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ శంకర్ ఒక ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాల అమలులో సామాన్య ప్రజలకు అన్యాయం జరిగితే సహించమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులను తీసుకుంటుందని పత్రికలలో వచ్చిన కథనాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం 6గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారని, మళ్లీ ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు నేరుగా అందించాలని, దరఖాస్తుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఒకే విడతలో రుణమాఫీ

తలకొండపల్లి: ఒకే విడతలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 లోగా చేసి, రైతులకు అండగా ఉంటామన్నారు. తాము చెప్పిన పంటలన్నింటికి మద్దతు ధర కల్పిస్తామని, అర్హులకు నూతన రేషన్ కార్డులు మంజూర్ చేస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ సీట్లు గెలుచుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

పచ్చిరొట్టతో అధిక దిగుబడి

- 50శాతం రాయితీతో జనుము, జీలుగ విత్తనాలు
- మండల వ్యవసాయ అధికారి అనురాధ



బొంరాస్‌పేట: పంటల సాగులో అధిక దిగుబడినిచ్చే పచ్చిరొట్ట ఎరువుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగ విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని తుంకిమెట్ల, బొంరాస్‌పేట, దుద్యాల ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పచ్చిరొట్టను ఎంచు కోవడం వలన సాగులో కలుపు మొక్కల నివారణ, జింక్‌లోపం, రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందని వివరించారు. పొలాల్లో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు చల్లుకొని 45 రోజులకు దమ్ము చేసుకోవాలని సూచించారు. 40 కిలోల జనుము సబ్సిడీ రూపంలో రూ.1,448, 30 కిలోల జీలుగ రూ.1,116కు విక్రయించనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధికదిగుబడులు పొందాలన్నారు.

దుకాణాలు తొలగించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రమేశ్ తదితరులు

తుర్కయంజాల్: సాగర్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న పండ్ల దుకాణాలను వెంటనే తొలగించాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామ భీంరెడ్డి, పన్నాల మధుసూధన్ రెడ్డిలు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. సత్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఈ దుకాణాలు బీఎన్ రెడ్డి నగర్ నుంచి సాగర్ కాంప్లెక్స్ వరకు ఉండేవని, అక్కడ జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిని పూర్తిగా తొలగించారని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాల వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీపాద శార్వాణి ఒక ప్రకటనలో కోరారు. ఆమనగల్లు పట్టణంలో గతేడాది ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారన్నారు. ఈ ఏడాది కళాశాలలో ప్రవేశానికి 'దోస్త్' వెబ్ ద్వారా అడ్మిషన్లు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. బీఏ, బీకామ్, బీఎస్సీ గ్రూప్‌లలో మొత్తం 60 సీట్ల చొప్పున 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీపాద శార్వణి పేర్కొన్నారు.

రైతు 'సంక్షేమానికి' సహకరించండి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ధారూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను అర్హులందరికీ దక్కేలా చూడాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, ఏఈఓ సంజూరాథోడ్, విద్యుత్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రైతు సంక్షేమానికి అధికారుల సహకారం అవసరమన్నారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి, తీగలు కిందకు వేలాడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీని వలన రైతులు, పశువులకు ప్రాణహాని ఉందని వాపోయారు. వెంటనే వాటిని సరిచేసి, సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతిగారి మల్లేశం,పవన్‌కుమార్, ప్రవీణ్‌గౌడ్, వెంకటేశం, సతీష్‌కుమార్, రాఘవేందర్, సాయిలు, మల్లేశం, రాములు, చిన్నయ్య, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొంటాం



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న డీసీఎంఎస్ సిబ్బంది తదితరులు

- దళారులను నమ్మి మోసపోవద్దు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందండి
- తాండూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జి మేనేజర్ ఎల్లయ్య

పెద్దేముల్: రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తాండూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జి మేనేజర్ ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధి మంబాపూర్, జనగాం గ్రామాల్లోని ధాన్యం కేంద్రాలను డీసీఎంఎస్, మండల ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడారు. రైతులు తమ దిగుబడిని దళారులకు విక్రయించి నష్టపోరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అమ్మి, మద్దతు ధర పొందాలని సూచించారు. ఇప్పటి వరకు తాండూరు నియోజకవర్గంలో సుమారు 498 మంది రైతుల నుంచి 65,336 బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

మండలాల వారీగా

పెద్దేముల్ మండలంలో 8,831 బస్తాలు, తాండూరులో 14,336 బస్తాలు, బషీరాబాద్‌లో 9,660, యాలాల పరిధి నుంచి 20వేల బస్తాల ధాన్యం రైతుల నుంచి సేకరించినట్లు అధికారి పేర్కొన్నారు. బార్‌దాన్ కొరత లేదని, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు లక్షా 50వేల గోనె సంచులు వచ్చాయని, వ్యవసాయ అధికారులు టోకన్‌లు ఇచ్చిన వెంటనే వాటిని రైతులకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఏ–గ్రేడ్ ధాన్యం రూ.2,203, బీ–గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర చెల్లించి, కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. 17 శాతం తేమ ఉన్న రైతులకే ఈ ధర వర్తిస్తుందని తెలిపారు.

మొక్కలు నాటండి



దేవుని పడకల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీశైలం తదితరులు

తలకొండపల్లి: ఇంటింటా మొక్కలు విరివిగా నాటి హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధి దేవుని పడకల్ గ్రామంలో ఆయన నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామంలో నర్సరీ మొక్కల పెంపకాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. మొక్కలు విరివిగా నాటేందుకు తగిన సహాయ సహకరాలు అందజేస్తానన్నారు. మొక్కల పెంపకంతో వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురుస్తాయన్నారు. దీంతో వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

మాడ్గుల: కొత్త బ్రహ్మణపల్లిలో శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, సభ్యుడు అనంతరెడ్డితో కలిసి తల్లి దండ్రులకు పాదపూజ చేపట్టారు. శుక్రవారం నర్సిరెడ్డి, అనంతరెడ్డిలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం తల్లిదండ్రులకు పాదపూజ చేసి పాఠశాలకు వెళితే వారి ఆశీస్సులతో మంచి వ్యక్తులుగా తయారవుతారన్నారు. నేటి సమాజంలో తల్లిదండ్రులు, బిడ్డలకు మధ్య అనుబంధం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి శిక్షణా శిబిరాలు తోడ్పాటునందిస్తాయన్నారు. కార్యక్రమంలో కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు చిత్తరంజన్‌దాస్, జీహెచ్‌ఎమ్ శంకర్, అకాడమీ సభ్యులు శ్రీశైలం, రాజు, శ్రీను, శేఖర్, మమత, పద్మ తదితరులు పాల్గొన్నారు.